వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 106 శనివారం | 21 అక్టోబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5



## పశ్చిమ బీజేపీ అభ్యర్థిగా
# రావు పద్మ

- పార్టీ పెద్దలనుంచి ఫోన్
- కొనసాగుతున్న ఉత్కంఠకు తెర
- కాషాయ దళంలో ఫుల్ జోష్
- పార్టీ శ్రేణుల సంబురాలు

2లో..




# కేసీఆర్‌కు ఓటమి భయం?

వివరాలు 2లో..

**ఇంటెలిజెన్స్ నివేదిక అదే చెబుతుందా**

**గజ్వేల్‌ను వీడనంటూనే కామారెడ్డిలో పోటీపై సర్వత్రా చర్చ**

**నియోజకవర్గం బయట సమావేశంపై అనుమానాలు**

**మేకపోతు గాంభీర్యం అంటూ విపక్షాల విమర్శలు**

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఓటమి భయం పట్టుకుందా.. ఇంటెలిజెన్స్ వర్గాలు అదే చెబుతున్నాయా.. గజ్వేల్‌ను వీడనంటూనే కామారెడ్డిలో పోటీ చేయడం వెనుక ఆంతర్యమేంటన్న అనుమానాలు సర్వత్రా వినిపిస్తున్నాయి. గజ్వేల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశం కూడా స్థానికంగా కాకుండా మేడ్చల్ జిల్లా అంతాయపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించడం కూడా కొంత బలం చేకూర్చుతోంది. ఈ సమావేశంలో పేరుకే ఎమ్మెల్యే అయినా గజ్వేల్ ప్రజలను కలవలేకపోవడం బాధగా ఉందంటూ చెప్పుకోవడం చూస్తుంటే కేసీఆర్ ఆత్మరక్షణలో పడ్డారా అన్న భావన కలుగుతోంది. అయితే గజ్వేల్‌లోనే ఇళ్లు, భూమి పెట్టుకుని నేనెందుకు అక్కడికి పోతా..నేను ఇక్కడే ఉంటా.. అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు విపక్షాలకు విమర్శనాస్త్రాలుగా మారుతున్నాయి. ఆయన మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారంటూ మండిపడుతున్నారు. - వరంగల్ వాయిస్ ప్రతినిధి






## పోలీసు అమరుల ఆశయాలను కొనసాగిద్దాం

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- ఘనంగా నివాళులర్పించిన ప్రముఖులు

8లో



# కేసీఆర్‌కు ఓటమి భయం?



**ఇంటెలిజెన్స్ నివేదిక అదే చెబుతుందా**

**గజ్వేల్‌ను వీడనంటూనే కామారెడ్డిలో పోటీపై సర్వత్రా చర్చ**

**నియోజకవర్గం బయట సమావేశంపై అనుమానాలు**

**మేకపోతు గాంభీర్యం అంటూ విపక్షాల విమర్శలు**

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** గజ్వేల్ ను వీడేది లేదంటూనే కామారెడ్డిలో ఎందుకు పోటీ చేస్తున్నారో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. అలాగే రెండు సార్లు ఇక్కడినుంచి గెలిచినా గజ్వేల్ ప్రజలను కలువలేకపోయానంటూ ఒప్పుకున్నారు. పేరుకు ఎమ్మెల్యే అయినా ఇక్కడి ప్రజలను కలవలేకపోవడం బాధగా ఉందంటూ చెప్పుకోవడం చూస్తుంటే కేసీఆర్ ఆత్మరక్షణలో పడ్డారా అన్న భావన వస్తోంది. గజ్వేల్ నేతలతో ముచ్చటించినా కామారెడ్డి విషయంలో మాత్రం సందేహాలను పెంచారు. అయితే గజ్వేల్ ప్రజలను ఆకట్టుకునేలా త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. మొత్తం 95 నుంచి 105 స్థానాల్లో గెలుస్తున్నాం.. అందులో డౌటే లేదంటూ ఆయన తేల్చిచెప్పారు. అయితే కేసీఆర్ కు ఓటమి భయం పట్టుకుందని, ఇంటెలిజెన్స్ నివేదికలు అదే చెబుతున్నాయంటూ ప్రచారం సాగుతోంది. అందుకే సొంత నియోజకవర్గంలో నిర్వహించాల్సిన సమావేశాన్ని మేడ్చల్ జిల్లా అంతాయపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసి కార్యకర్తలతో రహస్య మంతనాలు జరిపాడన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటెలిజెన్స్ రిపోర్ట్ ఆధారంగా ఓటమి భయంతో కార్యకర్తలతో వీరీటింగ్ పెట్టి బతిమిలాడుకున్నాడన్న ప్రచారం సాగుతోంది. దత్తత తీసుకున్న గ్రామాల్లో కూడా పెంకుటిల్లు కూల్చి ఇప్పటి వరకు వారికి డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వలేదని, వర్గల్‌లో ప్రభుత్వ భూమిని తీసుకొని వారికి సరైన పరిహారం చెల్లించకుండా, వాళ్ళకి ఇస్తానన్న ప్లాట్స్ కూడా ఇవ్వకుండా ఆ భూములను కోట్లకు అమ్ముకున్నారంటూ విపక్షాలు మండిపడుతున్నాయి. మల్లన్నసాగర్‌లో భూములు కోల్పోయిన వారికి ఇప్పటికీ ప్యాకేజీలు, డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వకుండా వాళ్ళను అడ్డా వీరీద కూలీలను చేశారన్న ఆగ్రహం వ్యక్తమవుతోంది.

## ఇక్కడే ఉంటా..

కామారెడ్డికి పోతా అంటూ ప్రచారం సాగుతోంది.. గజ్వేల్‌లో ఇళ్లు, భూమి పెట్టుకుని నేనెందుకు అక్కడికి పోతా.. నేను ఇక్కడే ఉంటా.. మీరేం రంది పడకండి..గజ్వేల్‌లో ఎవరు గెలుస్తరో.. వారిదే రాష్ట్రంలో గవర్నమెంట్.. ఇది వెనుకటి నుంచి వస్తున్నదే..అంటూ కార్యకర్తల్లో కేసీఆర్ బరోసా నింపే ప్రయత్నం చేశారు. అయితే ఇక్కడినుంచి గెలిచిన వారిలో చాలా మంది ముఖ్యమంత్రులయ్యారని, వారిలో నియంతలే ఎక్కువగా ఉన్నారంటూ చెప్పడం వెనుక తనకు తాను నియంత అని చెప్పకనే చెప్పుకున్నారు. నేను ఎక్కడికి పోతలేను.. అపోహ పడకండని చెబుతున్న కేసీఆర్ మరి కామారెడ్డిలో ఎందుకు పోటీ చేస్తున్నారో..ఎందుకు చేయాల్సి వచ్చిందో మాత్రం స్పష్టత నీయడంలేదు.

## నెల నెలా కలుస్తా..

ఇకముందు నెలలో ఒకరోజు వీరీకు కేటాయిస్తానంటూ కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు బరోసా ఇచ్చారు. ఎంత మెజార్టీ తెస్తరు అనేది వీరీ దయ అంటూ వేడుకోవడం అయనలో నెలకొన్న భయాన్ని బయటపెడుతోంది. ప్రజలకు మనమేందో తెలిసిపోయింది. కొత్తగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. ఒక లెవల్‌కు వచ్చాం. ఈ టర్మ్‌లో మిగతావన్నీ చేసి పెడుతాం అంటూ వారిని ఊరడించేలా మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గంలో తిరిగేటప్పుడు ఒక బాధ ఉంటది.. ఎందుకంటే.. నాకున్న బాధ్యతను, బరువును బట్టి.. నాకు ఒకటే ఒక మిస్సింగ్ ఏముంటది అంటే.. పేరుకు ఎమ్మెల్యేను కానీ ప్రజలకు కనబడను. అదో పెద్ద సమస్య. అందులో మధ్యలో కరోనా ఆగం చేసింది. వచ్చే టర్మ్‌లో ప్రతి నెలలో ఒకరోజు నియోజకవర్గానికి కేటాయించి, ముఖ్య కార్యకర్తలతో కలిసి అభివృద్ధిపై చర్చిస్తాను. అన్ని రంగాల్లో రాష్ట్రానికే తలమానికంగా ఉండేలా గజ్వేల్‌ను అభివృద్ధి చేసే బాధ్యత నాది అంటూ కేసీఆర్ చెప్పుకొచ్చారు. ఇకపోతే ఆనాడు ఎన్నికలు రాగానే.. రాయలసీమ, ఉత్తరాంధ్రకు టికెట్లు ముందు ఇచ్చేవారని కేసీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ దగ్గర ఉంటదనే నెపంతో లాస్ట్‌కు ఇచ్చేవారు. ఓ ఎలక్షన్ సమయంలో మా నాన్న చనిపోతే నేను టికెట్ కోసం పోలేదు. అప్పుడు వీరీ టికెట్ ఫైనల్ అయిందంట.. వచ్చి ఫారాలు తీసుకొని వెళ్లమని ముఖ్యమంత్రి ఎన్టీ రామారావునుంచి ఫోన్ కాల్ వచ్చిందని డీఎస్పీ వచ్చి నాకు చెప్పిండు. తెల్లారగానే హైదరాబాద్ వచ్చాను.. నాచారం స్టూడియోలో ఫారాలు ఇస్తున్నారంటే అక్కడికి వెళ్లాను. అక్కడ అందరు తెలంగాణ వారే ఉన్నారు. రాష్ట్ర స్థాయి నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారు. దేవుడి మెట్ల వద్ద బిచ్చగాళ్లు కూర్చున్నట్టు కూర్చున్నరు. చాలా బాధ కలిగింది. ఇది ఏం పద్ధతి అని.. టెంటు వేసి నాలుగు కుర్చీలు వేస్తే.. సరిపోయేది కదా అని అనుకున్నాను.

## అప్పుడూ.. ఇప్పుడూ బిచ్చగాళ్ల సీనే..

టికెట్ల కోసం వెళితే సేం బిచ్చగాళ్ల సీనే కనిపించిందని కేసీఆర్ తెలిపారు. నిజంగానే ఇప్పుడు కూడా అదే సీన్ ఉందని అంటున్నారు. కేసీఆర్ వద్దకు వెళ్లలేమని, ఆయన మావద్దకు రాలేదని అంటున్నారు. ఆనాటికీ నేటికీ పరిస్తితిలో మార్పు లేదని కేసీఆర్ చెప్పకనే చెప్పారు. అనేక అవరోధాలు అధిగమించి, పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకున్నాం. వీరీ అందరితో మనవి చేసేది ఒక్కటే.. గజ్వేల్ అభివృద్ధి అయింది అంటే అయింత ముఖం కొడుతది.. దిష్టి కొడుతది మనకు. కావాల్సింది చాలా ఉంది.. జరగాల్సింది ఇంకా ఉంది. ఎందుకంటే రాజకీయ నాయకులు ఎప్పుడు కూడా రిలాక్స్ కావొద్దు. ఇంకేం కావాలో ఆలోచించాలి తప్ప.. అయినదాంతో సంతృప్తి పడొద్దు. సాధించిన దానితో సంతృప్తి పడి సంబురాలు చేసుకోవడం కాదు.. భవిష్యత్‌ను ఇంకా మార్గనిర్దేశనం చేసుకోవాలి. ఇంకేం చేయాలో ఆలోచించాలి. జరిగింది వీరీ కండ్ల ముందే ఉంది డబ్బా కొట్టుకోవాల్సిన అవసరం లేదు అని కేసీఆర్ వారితో పేర్కొన్నారు. అయితే నిజంగానే ఇక్కడి ప్రజలను కలవలేనంత బిజీగా కేసీఆర్ ఉన్నారా అన్నది ఇప్పుడు నియోజకవర్గ ప్రజల్లో చర్చ సాగుతోంది. నిరంతరం వ్యవసాయ క్షేత్రంలో ఉంటున్నా..ఏ ఒక్కరోజు కూడా స్థానిక ప్రజలను కలుసుకోలేదన్నఆగ్రహం వ్యక్తమవుతోంది.

## కామారెడ్డిలో అంతర్మథనం..

కేసీఆర్ కామారెడ్డిలో గెలిచినప్పటికీ గజ్వేల్ కే పరిమితమవుతారన్న ప్రచారం అక్కడి ఓటర్లను ఆలోచింపజేస్తోంది. రెండు పర్యాయాలు గజ్వేల్ నుంచి గెలిచినా ఏ ఒక్క రోజు కూడా ప్రజలను కలుసుకోలేదు..వారి సమస్యలు పరిష్కరించలేదన్న భయం కామారెడ్డి ఓటర్లను వెంటాడుతోంది. సొంత ఇళ్లు, వాకిలి ఉన్న ఉరులోని వారికే కలువనోడు రేపు కామారెడ్డి ప్రజలను కలుస్తాడా..? ఇక్కడి ప్రజల కష్టాలు తీర్చుతాడా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒకవేళే గెలిపించినా ఇక్కడ రాజీనామా చేసి గజ్వేల్ కే పరిమితమైతా తమ పరిస్థితి ఏంటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

# పశ్చిమ బీజేపీ అభ్యర్థిగా రావు పద్మ

## పార్టీ పెద్దల నుంచి ఫోన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎట్టకేలకు బీజేపీ అభ్యర్థుల తొలిజాబితా సిద్ధమైంది. ఈమేరకు శనివారం రాత్రి పేర్లు ఖరారైన అభ్యర్థులకు పార్టీ పెద్దల నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయి. అధికారికంగా జాబితా విడుదలకు ముందే సంబంధిత అభ్యర్థులకు పార్టీ అగ్రనేతలు ఫోన్ చేసి జనంలోకి వెళ్లాలంటూ సూచించారు. ఇందులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మకే అవకాశం కల్పించారు. బీజేపీ అభ్యర్థిగా రావు పద్మకు తొలి జాబితాలోనే అవకాశం దక్కడంతో కాషాయ దళంలో ఫుల్ జోష్ కనిపిస్తోంది. అనేక రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడడంతో రెట్టించిన ఉత్సాహంతో ముందుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా బీజేపీ సత్తా చాటాలన్న వ్యూహంతో ముందు నుంచి పార్టీ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అనేక సమీకరణాలు, పరిణామాలు, సర్వేలు, అభిప్రాయాల అనంతరం.. రావు పద్మను బీజేపీ అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకుంటున్నాయి. వరంగల్ మహానగరంలో బీజేపీ బలోపేతానికి రావు పద్మ ఎంతో కాలంగా కృషి చేస్తున్నారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలోనే గత మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపులో కీలక పాత్ర పోషించారు. ఇంటింటికీ బీజేపీ పేరుతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ప్రధాని మోడీ చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కరోనా, వరంగల్ వరదల సమయంలో నగర ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకున్నారు. ఈ నేపథ్యంలోనే పార్టీ అధిష్ఠానం అన్ని కోణాల్లో పరిశీలన చేసి.. చివరకు వరంగల్ పశ్చిమ బీజేపీ అభ్యర్థిగా రావు పద్మకే అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది.

# సంరక్ష హాస్పిటల్‌లో బతుకమ్మ వేడుకలు




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలోని సంరక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో శనివారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో హాస్పిటల్ సిబ్బంది ఆడి, పాడి కనువిందు చేశారు. డాక్టర్లు, హాస్పిటల్ సింబ్బంది సంయుక్తంగా రంగు రంగుల పూలతో బతుకమ్మను పేర్చి వేడుకలు నిర్వహించారు. కన్నుల పండువగా సాగిన బతుకమ్మ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న డైరెక్టర్లు డాక్టర్ హెచ్.సంధ్యారణి, డాక్టర్ ఆర్. మాధవి మాట్లాడుతూ తెలంగాణలోనే వెయ్యి సంవత్సరాలనుంచి వివిధ పూలను పేర్చి బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ ఈ వేడుకల్లో పల్గొంటారన్నారు. బతుకమ్మలను అందంగా పేర్చి, ఆకట్టుకునేలా పాటలు పాడిన వారికి బహుమతులు ప్రకటించి అందజేశారు. పెద్ద ఎత్తున జరిగిన ఈ వేడుకల్లో ఆసుపత్రి సిబ్బంది వైష్ణవి, సరితశ్రీ, ఎన్.విద్యావతి, వై.కళ్యాణి, గౌతమి, ఆర్.శైలజ, సీహెచ్.జ్యోతి, జి.భారతి, అక్షయ, కె.రాజేశ్వరి, ప్రియదర్శిని, ఉమాదేవి, డి.చందన, రజిత, సుజాత, రమ పాల్గొన్నారు.

## కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ పోటీలు

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని ఆదివారం వరంగల్ నగరంలోని రంగసాయిపేటలో కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బెస్తం చెరువు దగ్గర బతుకమ్మ అలంకరణ పోటీలను నిర్వహిస్తున్నామని కార్యదర్శులు బొల్లెపల్లి రాజు, కత్తెరపల్లి వేణు ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

# అమలు కానీ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మేనిఫెస్టోలు

## ప్రజల్లో బీజేపీపై పెరిగిన విశ్వాసం

## బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తి రెడ్డి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మేనిఫెస్టోలు వేలంపాట పాడినట్లుగా ఉందని, ప్రజలను మభ్య పెట్టడానికి ఆ విధంగా రూపొందించారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, భూపాలపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తి రెడ్డి అన్నారు. మండలంలోని గోవిందా పూర్, పెద్దకొడపాక, జోగంపల్లి, కొప్పుల గ్రామాలలో శనివారం బీజేపీ భరోసా యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తి రెడ్డి పాల్గొని ప్రజలకు అభివాదం చేస్తూ పాదయాత్ర చేశారు. అనంతరం కొప్పుల గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు గడ్డం రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కీర్తి రెడ్డి మాట్లాడుతూ ఐదు సంవత్సరాలకు ఒకసారి పార్టీలు మారుతూ ప్రజలను మోసం చేస్తూ మళ్లీ మరోసారి ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు రూపంలో తగిన గుణపాఠం చెప్తారని పేర్కొన్నారు. అధికార పార్టీ అభ్యర్థికి ముఖ్యమంత్రి కేసీఆర్ బీఫామ్ అందజేస్తే, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావుకు డబ్బుల సంచులు అందిస్తున్నారని దుయ్యబట్టారు. ఎవరు గెలిచినా ఆ గూటికి చేరేవారని అన్నారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తనకు ఉన్న ఆస్తులను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంటే, మరొకరు గండ్ర సత్యనారాయణ రావు ఒకసారి ఎమ్మెల్యే కావాలని తపన తప్ప ప్రజల సంక్షేమం కోసం కాదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కేంద్ర నిధులతోనే జరుగుతున్నాయని, దానికి పంచాయితీలలో సిబ్బంది వేతనాలు, గ్రామాలలో పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటికలు, 18వ ఆర్థిక సంఘం నిధులతోనే జరుగుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అరవై ఏళ్ల పాలల్లో రైతులు ఆత్మహత్యలు తప్ప రైతులకు ఏమి చేసింది లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో పుట్టబోయే బిడ్డపై కూడా రూ.1,25,000 అప్పు భారం మోపుతుందని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలు కేంద్రంలో ప్రధాని మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రైతులకు అందిస్తున్న సబ్సిడీపై ఎరువులు, కేంద్ర నిధులతో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి గమనించి బీజేపీని ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు నాగపూరి రాజమౌళి గౌడ్, వెన్నంపల్లి పాపయ్య, చదువు రామచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి, నియోజకవర్గ నాయకుడు తాటికొండ రవి కిరణ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నరహర శెట్టి రామకృష్ణ, కానుగుల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## పాలకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని ఫతేపురం గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ –పల్లె పల్లెకు ఝాన్సమ్మ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఝాన్సీ రెడ్డికి బతుకమ్మలతో, బోనాలతో గ్రామ మహిళలుఘన స్వాగతం పలికారు. గ్రామంలో ప్రతిష్టించిన దుర్గా మాత ఆలయంలో ప్రత్యేక నిర్వహించి, అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ 9సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో చేసింది ఏమీ లేదని, కాళేశ్వరం ప్రాజెక్టు పేరు మీద లక్షల కోట్ల అవినీతి పాల్పడ్డారని రాష్ట్రంలో కాలేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేటీఆర్, కేసీఆర్ ఖజానా నింపుకుంటే, పాలకుర్తిలో దగా దయాకర్ రావు మిషన్ భగీరథ పేరుతో నాణ్యతలేని పనులు చేసి వేల కోట్ల రూపాయలు తన ఖజానాలో వేసుకున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో కేడీని, పాలకుర్తిలో ఈ దొంగని తరిమికొట్టేందుకు పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బూత్ స్థాయి నుంచి ఒక సైనికుడి లాగా పని చేయాలన్నారు.

## వైభవంగా శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో ప్రసిద్ధ శైవక్షేత్రమైన శ్రీకుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీదేవీశరన్నవరాత్ర మహోత్సవములు అత్యంత వైభవంగా శైవాగమోక్తంగా బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్ కుమార్ శర్మ ఆచార్యత్వమున వైభవంగా నిర్వహించబడుతున్నాయి. ఉత్సవాలలో శనివారం కార్యక్రమంలో భాగంగా ఉ.5 గంటలకు సుప్రభాత సేవ, సుగంధ పరిమళ ద్రవ్యములతో అభిషేకం, మంటపారాధన, నవావరణపూజా, శ్రీచక్రార్చన, నేడు కాళరాత్రీ క్రమములో శ్రీభవానీదేవిగా అలంకరించి విశేషోత్సవం, నిత్యోపాసన, చండీయాగం, ఆయుష్యహోమం నిర్వహించారు. చండీయాగం కరుణ రాజు దంపతులచే నిర్వహించారు. రేపు దుర్గాష్టమి విశేషోత్సవము, సద్దులబతుకమ్మ జరుగుతుందన్నారు. భక్తులు అధిక పాల్గొని స్వామివారి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని చైర్మన్ గంధ వెంకన్న కోరారు.

## బాధిత కుటుంబాలకు చల్లా పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** గీసుగొండ గ్రామ మాజీ సర్పంచ్ కోల కుమారస్వామి తల్లి కోల వరలక్ష్మి కొద్ది రోజుల క్రితం మృతిచెందడం జరిగింది. శనివారం స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వరలక్ష్మి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అదే విధంగా మండలంలోని కొనాయిమాకుల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న గుండేకారి సాంబరాజు, యాదగిరి, శిరిషే అశోక్ లను పరామర్శించి వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామంలో ఇటీవలే పలు కారణాలతో మృతిచెందిన చాపర్తి రాజు, దుర్నాల రాజేశ్వర రావు, కాటబత్తిని రాజశేఖర్, వీరయ్య, తుడుం మల్లయ్య, ఐలయ్య కుటుంబాలను ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం ఉదయం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్ర పటాలను పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 15, 16 డివిజన్ల పరిధిలోని గొర్రెకుంట, ధర్మారం గ్రామాలలో ఇటీవల పలు కారణాలతో మృతిచెందిన గంగుల అరుణ్, బండి దివ్య, గజ్జి సుందర్, జన్ను సిద్దు, ఇండ్ల యాకయ్య, శ్రీరాముల కట్టమ్మ, కంజర్ల మరియమ్మ కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యకర్తల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా పోతారాజుపల్లి, ధర్మారం గ్రామాలలో అనారోగ్యంతో బాధపడుతున్న పుసుకూరి వీరమల్లు, నాసం పద్మ లను ఎమ్మెల్యే పరామర్శించి వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ఎన్నికల వ్యయాన్ని అదుపు చేయాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర శాసనసభకు జరగబోతున్న ఎన్నికలలో ఎన్నికల ఖర్చును డబ్బు ప్రభావాన్ని అదుపు చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు శాసనసభ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి 40లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేయకుండా చర్యలు చేపట్టాలని ఎలక్షన్ కమిషన్ ను కోరారు. శాసనసభకు పోటీ చేసే ప్రతి అభ్యర్థి నామినేషన్ తో పాటు కొత్త బ్యాంక్ అకౌంట్ లో ఖర్చు చేయాలనుకుంటున్న డబ్బును మొదట డిపాజిట్ చేసి ఆ డిపాజిట్ చేసిన మొత్తం నుంచే వివిధ కార్యక్రమాల కోసం ప్రతిరోజు ఖర్చు పెట్టాలి, అభ్యర్థి చేసిన ఖర్చుని ప్రతిరోజు ఎన్నికల అథారిటీకి సమర్పించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే ప్రతి నియోజకవర్గంలో ఒక్కొక్క అభ్యర్థి 20 నుంచి 50 కోట్ల రూపాయల వరకు ఖర్చుపెట్టడానికి సిద్ధపడుతున్నారనే అనే వార్తలు వస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనలను కఠినంగా అమలు చేయడంతో పాటు మరింత నిఘా పెంచాలని అభిప్రాయపడ్డారు.

## దుర్గామాత ఉత్సవాల్లో అన్నదానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 50వ డివిజన్ జూలైవాడ సెంటర్‌లో కార్పొరేటర్ నెక్కొండ కవిత కిషన్‌కుమార్ ఆధ్వర్యంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రతి సంవత్సరం వైభవంగా జరుపుతారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కేయూ విశ్రాంత ఆచార్యుడు గడ్డం భాస్కర్, కవితా కిషన్ కుమార్, తమ్మస్వామి ప్రారంభించారు. అమ్మవారి ఆశీస్సులు డివిజన్ ప్రజలపై ఉండాలని కోరుకున్నారు.

### ధర్మసాగర్‌లో..



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మండలంలోని దేవి దుర్గామాత అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిన్న రాత్రి 8గంటలకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు రాకేష్, గంటె వంశీ, నాన్నబోయిన లక్ష్మణ్, గంట సాంబరాజు, శాతవేనీ సంపత్, మహేష్ యాదవ్, యువకులు పాల్గొన్నారు.

## వరంగల్ పశ్చిమ టికెట్ జంగాకే ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్ జంగా రాఘవరెడ్డికే ఇవ్వాలని సిటీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కట్ల శ్రీనివాస్, 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, 63వ డివిజన్ కార్పొరేటర్స్ విజయశ్రీ సయ్యద్ రజాలి అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో సిటీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, 62, 63వ డివిజన్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో శనివారం పత్రికా సమావేశం నిర్వహించి వరంగల్ పశ్చిమ నుండి కాంగ్రెస్ పార్టీలో జంగా రాఘవరెడ్డికే టికెట్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనునిత్యం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కష్టకాలంలో అండగా ఉంటూ ప్రతి ఒక్క కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడిన వ్యక్తి జంగా రాఘవరెడ్డి అని అన్నారు. అదేవిధంగా గతంలో అధిష్టానం ఆదేశాల అనుసారంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కడ బాధ్యతలు ఇచ్చిన సక్రమంగా నిర్వహించి యావత్ జిల్లా కాంగ్రెస్ పార్టీని జంగా కాపాడరన్నారు. వారు గతంలో 2016లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నాలుగు కార్పొరేటర్ లను గెలిపించిన ఘనత ఉందన్నారు. 2021లో జరిగిన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఎన్నికలలో కూడా ఇద్దరు కార్పొరేటర్లను గెలిపించిన ఘనత రాఘవ రెడ్డిది అని పేర్కొన్నారు. జంగా రాఘవ రెడ్డి పైసలకు అమ్ముడుపోయే వ్యక్తి కాదని కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే వ్యక్తి అని అన్నారు. మరి ఇలాంటి నాయకుడికి వరంగల్ పశ్చిమలో టికెట్ ఇవ్వాలని, భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని వేడుకున్నారు. ఒకవేళ టికెట్ ఇవ్వకుంటే మూకుమ్మడి రాజీనామాలకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కాంటెస్టెడ్ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీగా ఓటు వేయాలి



**వరంగల్ వాయిస్, రేగొండ :** నిజాయితీగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆధార్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ అభ్యర్థి తాళ్లపెల్లి రమేష్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం రేగొండ మండల కేంద్రంలో ఓటర్ ఐడీ కార్డులకు పాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రచారం చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో రమేష్ గౌడ్ మాట్లాడుతూ ఓటు హక్కును నైతికంగా వినియోగించుకున్నప్పుడే అంబేద్కర్ ను గౌరవించిన వాళ్లమవుతామన్నారు. ఆయన భావజాలాన్ని వాస్తవికంగా అనువదించాలనుకుంటే, ఓటు హక్కును నైతికంగా, న్యాయంగా వినయోగించు కోవాలన్నారు. అదే మన ప్రధాన కర్తవ్యం కావాలని పిలుపు నిచ్చారు. ఓటు హక్కును వినయోగించుకోవడం ద్వారా మన రాజ్యాంగ హక్కులను పరిరక్షించుకున్న వారమవుతామని అన్నారు. తనపై నమ్మకంతో టికెట్ ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు ఈడే శేషగిరి గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఓటును వినియోగించడం దేశ పౌరసత్వానికీ చాలా నీతి, నిజాయతీ, నమ్మకం, బాధ్యతలున్న నాయకుడిని గెలిపించి చట్టసభల్లోకి పంపిస్తే ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కోసం ఆ వ్యక్తి కృషిచేస్తారని తెలిపారు. మౌలిక వసతులు కల్పించడం కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బాధ్యతగా పనిచేస్తారని అంబేద్కర్ అన్నారు. అందుకే ఓటు హక్కును భారత రాజ్యాంగంలో పొందుపరిచారని చెప్పారు. అదే ఇప్పుడు భారతీయుల చేతిలో ఉన్నా బ్రహ్మాస్త్రం. 'ఓటు హక్కు'ను నేటి రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పు దారి పట్టిస్తున్నారు. వారిని ప్రలోభాలకు గురిచేస్తూ ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఓటరు మహాశయులారా అలాంటి వారిని తరిమికొట్టి మన ప్రాంతాభివృద్ధి కోసం పాటుపాడుదామన్నారు. నిజమైన, నిఖార్సైన నాయకుడుని గెలిపించాలని ఆయన కోరారు.

## లలితా సహస్రనామార్చన, కుంకుమార్చన



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి సన్నిధిలో శనివారం భద్రకాళీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు శ్రీ భద్రకాళి అమ్మవారు శ్రీ మహిషాసుర మర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు చతుషష్టి సహిత లలితా సహస్రనామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ కిషన్ రావు దేవాలయ ఉప ప్రధాన అర్చకులు కె.రాజయ్య, ముఖ్య అర్చకులు సదానందం, రాంబాబు, అర్చకులు శ్రీకాంత్, రమేష్, వీరభద్రయ్య, వినయ్ శర్మ, శరత్ చంద్ర, శివకుమార్, శ్రవణ్, సిబ్బంది రవీందర్, శ్రీధర్ , సందీప్, రాజు, భిక్షపతి, భక్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ధర్మారెడ్డికి గుణపాఠం తప్పదు



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండలంలోని కొత్తగట్టు మల్కపేట గ్రామాలలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం ఆధ్వర్యంలో బీజేపీ గడపగడపకు కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను బీజేపీ నాయకుడు డా.పగడాల కాళీ ప్రసాద్ రావు ప్రజలకు వివరిస్తూ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు ధర్మారెడ్డిని ఓడించడమే ధ్యేయంగా ఉన్నారన్నారు. గతంలో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చకుండా దళిత బంధు, బీసీ బంధు, ట్రాక్టర్ల స్కీములన్నీ బీఆర్ ఎస్ కార్యకర్తలకే ఇచ్చుకుంటూ అర్హులైన ప్రజలకు ఇవ్వకుండా మోసం చేస్తున్నందున ప్రజలు తిరగబడి ఎమ్మెల్యే ధర్మా రెడ్డికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ జిల్లా కన్వీనర్ ఎదు లాపురం శ్రవణ్ కుమార్, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, అగ్రంపాడు మాజీ సర్పంచ్ గుల్లపల్లి వెంకన్న, మండల కార్యదర్శి బయ్య పైడి, మండల కోశాధికారి కోరుకొప్పుల నాగరాజ్, కొరుకుప్పల రమేష్, సురేష్, శ్రీకాంత్, మల్కాపేట రవి, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి బండి శ్రవణ్ కుమార్, బూత్ అధ్యక్షులు కోరుకొప్పుల ప్రశాంత్, జిల్లెల్ల రజనీకాంత్, కొమ్మినేని వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మిరప రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలి



**వరంగల్ వాయిస్, కురవి :** మిరప పంటకు గుబ్బ తెగులు సోకి తీవ్రంగా నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నిర్మాణ బాధ్యులు నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. కురవి మండలంలో గుబ్బ తెగులు సోకిన మిరప పంటను శనివారం రైతు సంఘం బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ మిరప పంటను ఎన్నో ఆశలతో సాగు చేస్తున్న క్రమంలో గుబ్బ తెగులు సోకి పూత, కాత లేకుండా నిట్ట నిలువునా ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనతో రకరకాల మందులను పిచికారి చేసినా లాభం లేక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఈ సమయంలో ఉద్యానవన శాఖ అధికారులు కళ్లుండి చూడలేని కబోదిలా వ్యవహరించడం రైతాంగం పట్ల అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. వ్యవసాయశాఖ జిల్లా ఉన్నతాధికారులు వెంటనే ఉద్యానవన అధికారులపై చర్యలను తీసుకోవాలని, పంట నష్టపరిహారాన్ని పరిశీలించి ఇప్పటికైనా రైతాంగానికి నష్టపరిహారం చెల్లించే విధంగా సిఫారసులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ బృందంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నెల్లూరు నాగేశ్వరరావు, నాయకులు పోగుల శ్రీనివాస్ గౌడ్, కరణం రాజన్న, కురియాల వీరన్న, కృష్ణ, శివ, అశోక్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరులకు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, మామునూరు :** నాలుగో బెటాలియన్ టీఎస్ఎస్పీలో పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా పోలీస్ అమరవీరులకు 4వ, 5వ బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భారతదేశం అంతటా ఈ సంవత్సర కాలంలో అసువులు బాసిన 189అమరవీరుల పేర్లను అసిస్టెంట్ కమాండెంట్ జయరాం చదివి వినిపించారు. అనంతరం కమాండెంట్ అమరవీరుల కుటుంబాలకు బహుమతులు అందించారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరవలేనివని, వారి త్యాగ ఫలితమే మనం ఈ రోజు స్వేచ్ఛగా జీవిస్తున్నామని అన్నారు. పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అన్ని విధాలుగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు జయరాం, రాంబాబు, సోమని, శ్రీనివాస్, డాక్టర్ విజయ్ కుమార్, నాలుగో బెటాలియన్, ఐదో బెటాలియన్ అధికారులు, సిబ్బంది, మినిస్ట్రీయల్ స్టాఫ్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని వెలికట్ట శివారు పాలకేంద్రం సెంటర్ లో నివాసముంటున్న రెడ్డి హెూటల్ నిర్వాహకుడు వెంకట్ రెడ్డి, బజాజ్ షోరూం యజమాని కోటిరెడ్డి తండ్రి కొనతల జగ్గారెడ్డి(85), ఖానాపురం గ్రామానికి చెందిన ఐకేపీ వీవోఏ రవీందర్ తండ్రి ఇదినూరి ఇస్తారి (80)అనారోగ్య కారణాలతో మరణించారు. కాగా విషయం తెలుసుకున్న మండల బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇంచార్జి గుడిపూడి మధుకర్ రావు, జడ్పీటీసీ, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ మంగళ పెల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు డాక్టర్ పొనుగోటి సోమేశ్వరరావు శనివారం పార్థివ దేహాలకు పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తక్కళ్లపల్లి దేవేందర్ రావు, బత్తుల యాకయ్య, దీకొండ బాలకృష్ణ, సంతోష్, శెట్టిపెల్లి ఉమారాణి, ముడుపు రవీందర్ రెడ్డి, మాచర్ల రమేష్, మూడు వెంకట్ రెడ్డి, మాచర్ల వీరేష్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## జానా యశ్విత్‌రాజ్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నాలుగో బెటాలియన్ మామునూరులో విధులు నిర్వహిస్తున్న రిజర్వ్ ఇన్ స్పెక్టర్ రాజ్ కుమార్ కుమారుడు జానా యశ్విత్ రాజ్ సీబీఎస్ సీ నేషనల్ లెవెల్ జూడో చాంపియన్ షిప్ లో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా యశ్వంత్ రాజును బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు జయరాం, రాంబాబు, రిజర్వ్ ఇన్ స్పెక్టర్లు శోభన్, దయాశిలా, రాజ్ కుమార్, అశోక్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** నీరుకుళ్ల జడ్పీఎస్ఎస్ 2005-06 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నీరుకుళ్లలోని చెన్నకేశవ స్వామి మినీ ఫంక్షన్ హాల్ లో శనివారం ఈ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా 17సంవత్సరాల క్రితం పాఠశాలలో వారు చదువుకున్న కాలం నాటి సంగతులను విద్యార్థిని, విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. అప్పుడు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను ఆహ్వానించి వారితో అప్పటి మధుర జ్ఞాపకాలను పంచుకుంటూ ఉపాధ్యాయులు బ్రహ్మయ్య వెంకన్న సిద్ధి రాజయ్య, వేణుగోపాల్, లక్ష్మణ్, పీఈటీ బెంజిమెన్ లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు లక్కర్సు రాజు, చందు, రమణాచారి, ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి, బలవంతుల శ్రీకాంత్, శ్యామ్, లకుం రజిని, మంగ రజిని, మాధవి, ప్రశాంత్, రమేష్, సంతోష్, మహేందర్, రాజేష్, రజినీకాంత్, వెంకటేష్, మురళి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో వలసల జోరు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని తహరాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ ముఖ్య నాయకులు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సమక్షంలో రేణికుంట్ల కుమార్, కో ఆప్షన్ నెంబర్, కొమ్ముల సతీష్ బీజేపీ బూత్ అధ్యక్షులు, కొమ్ముల రమేష్ బీజేపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు, ముక్కెర నితిన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు, ముక్కెర చిన్న సదయ్య బీజేపీ గ్రామ కార్యదర్శి, దొమ్మటి రాజయ్య, 30మంది శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ మేరకు భూపాలపల్లి ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలో అందరూ కలిసికట్టుగా రావాలని, సంక్షేమ పథకాలను అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరిని కుటుంబ సభ్యులుగా భావిస్తూ వారి యోగక్షేమాలలో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికలకు భూపాలపల్లి నియోజకవర్గం నుంచి ప్రతిఒక్కరూ కదలి రావాలని, ప్రభుత్వం చేసిన అభివృద్ధిని జరుగుతున్న సంక్షేమాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాంశెట్టి లత లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, గ్రామ ఎంపీటీసీ గొట్టిముక్కల స్వాతి విష్ణువర్ధన్ రెడ్డి, హుస్సేన్ పల్లి సర్పంచ్ గుండెకారి రజితశ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు రేణికుంట్ల సుమన్, మాజీ సర్పంచ్ జిన్న రాజేందర్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ రేణికుంట్ల సదయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నిమ్మల మహేందర్, పార్టీ నాయకులు కొమ్ముల సదానందం, యూత్ అధ్యక్షుడు విజయ్, వార్డు సభ్యులు కొమ్ముల సంతోష్ పాల్గొన్నారు.

## బీజేపీ రజక సెల్ జిల్లా కన్వీనర్‌గా సదానందం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** భారతీయ జనతా పార్టీ స్టేట్ ఆఫీస్ లో శనివారం జరిగిన ఓబీసీ మోర్చా రజక సెల్ రాష్ట్ర సమావేశం, బీసీ మహా గర్జన సభ సన్నాహ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలే భాస్కర్ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, కొన్నే సంపత్ రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ సదానందంను హనుమకొండ జిల్లా బీజేపీ రజక సెల్ కన్వీనర్ గా ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

## అమ్మవారికి ఎమ్మెల్యే నన్నపునేని పూజలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 34వ డివిజన్ శివనగర్ లో దేవి భ్రమరాంబిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శనివారం హాజరై అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవి భ్రమరాంబిక ఉత్సవ కమిటీ సభ్యులు కొనకంచి కృష్ణకుమారి, బారిశెట్టి ఉమా పారిజాతం, వైష్ణవి, తాళ్లపెల్లి ఉమా, డివిజన్ అధ్యక్షుడు పగడాల సతీష్, మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మ, పూజారి వరియోగుల శ్రీనివాస్, తోగారి వేణు, నూనె శంకర్, బత్తుల రమేష్, బోడాకరి మధు, మంద అక్షిత్, డివిజన్ ముఖ్య నాయకులు హాజరయ్యారు.

## దాస్యం వినయ్ భాస్కర్ ఎన్నికల ప్రచారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేట జంక్షన్ లో కొబ్బరికాయలు కొట్టి ప్రచార రథాలను ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ప్రారంభించారు. అనంతరం కాజీపేటలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపుల్లో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత అనేక సంక్షేమ పథకాలతో దూసుకుపోతుందన్నారు. గడప గడపకు, ఇంటి ఇంటికి ప్రతి ఒక్క పథకం చేరువయ్యేలా, అభివృద్ధి సంక్షేమ పథకాలు ఉన్నాయని, దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనటువంటి అభివృద్ధి పథకాలు మన రాష్ట్రంలో ఉన్నాయని అన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తూ దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపినటువంటి కేసీఆర్ ను, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అందరూ ఆదరించాలని అన్నారు. మీలో ఒక కుటుంబ సభ్యుడిగా ఉన్న నన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

**ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి**



**వరంగల్ వాయిస్, కాజీపేట :** సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ ఉత్సవాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. మడికొండలో అంబేద్కర్ విగ్రహం సర్కిల్ వద్ద మహిళలు పాల్గొని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన నేదునూరి జ్యోతి మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పకృతి ఆధారంగా విభిన్న పూలతో తొమ్మిది రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సవాలను నిర్వహించుకుంటారని అన్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి పల్లెలో పూర్వం నుంచి వస్తున్న ఆచారాల సాంప్రదాయాలు పాటిస్తూ చెరువుల కుంటలలో విభిన్న పూలతో వేయడంతో కాలుష్య నివారణకు తోడ్పడతాయన్నారు. తద్వారా ఎలాంటి జబ్బులు రాకుండా, అనారోగ్యం పాలు కాకుండా ఉపయోగపడే విధంగా ఇందులో సైన్స్ దాగి ఉందన్నారు. ఈ సాంప్రదాయాలను అందరూ ఆస్వాదించాలని మహిళా లోకాన్ని కోరారు. నేడు ప్రపంచంలో మహిళలు విజ్ఞానంతో శాస్త్ర సాంకేతిక రంగాల్లో మగవారితో పోటీపడే విధంగా ఉండడం సంతోషకరమని, దేశంలో రాష్ట్రంలో మహిళలకు హక్కులను కాపాడడంలో పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు తమ హక్కులను కాపాడుకుంటూ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా కృషి చేయాలన్నారు. ఈ బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా స్ఫూర్తిని తీసుకొని ముందుకు సాగాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి కోరారు. ఈ కార్యక్రమంలో రాసమల్ల దీన, బండ్లోజు రాజమణి, కోరపల్లి జ్యోతి, రజిత, లక్ష్మి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి మునగాల భిక్షపతి, మాలోతు శంకర్, సుమన్ పాల్గొన్నారు.

# శంకరమఠంలో సుదర్శన హోమం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా కేంద్రంలోని శ్రీ శృంగేరి శంకరమఠంలో జరుగుతున్న శ్రీ శారద శరన్నవరాత్రి ఉత్సవాల్లో శనివారం సుదర్శన హోమం నిర్వహించారు. సాంప్రదాయనిత్య పూజల్లో భాగంగా శనివారం ఉదయం ప్రధాన అర్చకులు శ్రీ సంగమేశ్వర జ్యోషి అధ్వర్యంలో అర్చకులు సోమశేఖర శర్మ, సాయి గణేష్ శర్మ, విశాల్ శర్మ, వివేక్ శర్మలు శ్రీ శారదాంబ అమ్మవారికి, శ్రీ శక్తి గణపతికి, శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి కి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అనంతరం అర్చకులు చంద్రశేఖర శర్మ శృంగేరి సంప్రదాయ పద్ధతుల్లో సుదర్శన హోమంను రామ గోవర్ధన్ - రాజకుమారి దంపతులతో నిర్వహించారు. శ్రీ శారద అమ్మవారి మహా మంగళ హారతుల అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. శ్రీ శృంగేరి సేవా సమితి సభ్యులు మదన్మోహన్, దేవేందర్, రామారావు, రాజేంద్ర ప్రసాద్, రవీందర్,మహిపాల్, సర్వేశ్వర్, వంశీ, రాజు, వెంకటేశ్వర రావు, భాస్కర్, మురళీధర్, సంధ్యారాణి, పద్మ, రమాదేవి, కళ్యాణి, రోజాలు అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు సేవలు అందించారు. అలాగే సాయంత్రం అన్నవజ్జుల వేణుగోపాల్ -అనుపమ దంపతులు సుహాసినీలతో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం అభినవ శుక అన్నవజ్జుల సోమశేఖర శర్మ శ్రీదేవి భాగవతం పురాణ ప్రవచనం చేశారు. రాత్రి వరంగల్ సుందర్ సత్సంగ్ భజన కార్యక్రమం భక్తులను ఆనందింపజేసింది.

# ఉద్యోగులకు అండగా పనిచేశా : చీఫ్ విప్ దాస్యం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాజీపేటలోని రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ హాజరై మాట్లాడుతూ ఉద్యోగులు రిటైర్డ్ అయినప్పటికీని రైల్వేను అభివృద్ధి చేయడంలో వారి యొక్క పాత్ర ఎంతో ఉందన్నారు. ఇక్కడికి కార్మిక పక్షపాతి, ఉద్యోగ పక్షపాతి, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు తెలిసిన వ్యక్తిగా వచ్చానన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల తీపి గుర్తులు చేదు అనుభవాలు తెలుసన్నారు. కరోనా కష్టకాలంలో చాలా బాధాకరమైన సందర్భాలు ఉన్నాయని, కరోనా పరిస్థితిల్లో శానిటేషన్ వర్క్ చేస్తున్నటువంటి వారి పరిస్థితిని చూసి చలించిపోయానన్నారు. కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు అందరి సహకారంతో రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను 46వేల కుటుంబాలకు ఇచ్చామన్నారు. నిస్సహాయ స్థితిలో ఉన్నటువంటి రిటైర్డ్ ఉద్యోగులకు కూడా నాకు చేతనైనంత సహాయ సహకారాలు అందించానన్నారు. కరోనా సమయంలో అనేక ఫోన్ కాల్స్ వచ్చాయని, అందులో 82ఏళ్ల సిరాజుద్దీన్ అనే వ్యక్తి ఫోన్ చేశారని అన్నారు. ఫోన్ చేసి మెడిసిన్ ఇప్పించమని ఆవేదనతో అడిగారని తెలిపారు. పొద్దున ఫోన్ ఎత్తకుంటే మధ్యాహ్నం చేయ్, మధ్యాహ్నం ఎత్తకపోతే సాయంత్రం చేయ్, సాయంత్రం కూడా ఫోన్ ఎత్తకపోయినట్లయితే నేను చనిపోయినానని అనుకోమని చెప్పగా తను చాలా బాధపడినసందర్భాన్ని గుర్తు చేశారు. నా కొడుకు దుబాయిలో ఉంటాడు. నేను చనిపోయిన అని అతడికి సమాచారం అందించమని ఫోన్ నెంబర్ కూడా ఇచ్చారన్నారు. చాలా మంది రిటైర్డ్ ఉద్యోగులు ఒంటరిగా గడుపుతారని, వారికి అందరు కలవడానికి గాను రిటైర్డ్ ఎంప్లాయిస్ అందరికీ బిల్డింగ్ ఇప్పించడం జరిగిందన్నారు. బిల్డింగ్ తో పాటు ఇన్నోవేషన్, ఫర్నిచర్ కోసం నాకు వచ్చే వేతనం నుంచి అందజేశానన్నారు. మానవీయ కోణంలో అందరూ కూడా ఒక దగ్గర కలిస్తే వారి బాధలను పంచుకోవచ్చని తెలిపారు.

రిటైర్డ్ లెక్చరర్లు, అధ్యాపకులు, పోలీస్ ఆఫీసర్ల కోసం భవనాలను మంజూరు చేశానని తెలిపారు. పోలీస్ ఆఫీసర్లు నా దగ్గరికి వచ్చి మేము పనిచేసిన పోలీస్టేషన్ లోకి వెళితే విలువ ఇవ్వడం లేదనే విషయాన్ని నాకు తెలుపగా, సీపీతో మాట్లాడి వారికి భవనాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. ఇలా రిటైర్డ్ ఉద్యోగులంతా ఒక్క గూటికి రావడం చాలా సంతోషకరమని, మీరందరూ ఆశీర్వదిస్తే గతంలో కన్నా రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తానని, మీరు కడుపులో పెట్టుకొని చూసుకుంటే, నేను మిమ్మల్ని గుండెల్లో పెట్టుకుంటానని అన్నారు. ఈసారి కూడా నన్ను ఆశీర్వదించాలని కోరుకుంటున్నానని, గెలిచిన తర్వాత మీలో ఒక కుటుంబ సభ్యుడిగా, అన్నగా, ఒక కొడుకుగా అండగా ఉంటానని అన్నారు. కార్యక్రమంలో రైల్వే పెన్షనర్ వెల్ఫేర్ ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ సభాధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి శంకర్రావు, పెద్దలు శాస్త్రీ,వెంకటయ్యతో పాటు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
శనివారం 21, అక్టోబర్ 2023
www.warangalvoice.net

# ఎన్నికల నియమావళిని పకడ్బందీగా పాటించాలి



**వరంగల్ వాయిస్, మనుమకొండ :** రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించే తనిఖీల్లో పట్టుబడే నగదు, బంగారం సీజ్ చేసేటప్పుడు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్, ఇతర రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు, ఎంసీఎంసీ, నగదు, బంగారం పట్టివేత, సీ- విజిల్ యాప్, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించా లని, రాజకీయ పార్టీల, అభ్యర్థుల నుంచి వచ్చే ఫిర్యాదులకు తప్పనిసరిగా తీసుకున్న చర్యలపై లిఖిత పూర్వక సమాధానం అందించాలని సూచించారు. ఎన్నికల ప్రచారం సంబంధించిసమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధుల, అభ్యర్థుల నుంచి సువిధ యాప్ ద్వారా, ఆఫ్ లైన్ లో వచ్చే దరఖాస్తులకు ఎప్పటికప్పుడు సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని, క్షేత్రస్థాయిలో జరిగే ఎన్నికల ప్రచారంలో వినియోగించే ఆడియో, వీడియోలను పరిశీలించి ఎంసీఎంసీ ధృవీకరించాలని, ప్రతి రోజూ ఎంసీఎంసీ, సువిధ యాప్, అఫ్ లైన్ దరఖాస్తులపై ఎన్నికల అధికారి దృష్టి సారించాలన్నారు. ఎన్నికల సమయంలో నిర్వహించే తనిఖీల్లో నగదు, బంగారం సీజ్ చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై క్షేత్రస్థాయి అధికారులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని అన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో సంబంధిత వ్యక్తులకు సీజ్ చేస్తున్న నగదు, బంగారం వివరాలు, ఎక్కడ అప్పీల్ చేయాల్సి ఉంటుందనే అంశాలను తెలియజేస్తూ రశీదు తప్పనిసరిగా అందించాలని అన్నారు. సీజ్ చేసిన బంగారం, నగదు 10 లక్షల కంటే తక్కువైతే వెంటనే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్ కు అప్పగించాలని, 10లక్షల కంటే ఎక్కువ నగదు సీజ్ చేస్తే ఐటీ అధికారులకు అప్పగించాలన్నారు. సదరు నగదుపై వచ్చే అప్పీల్ లను సంబంధిత గ్రీవెన్స్ సెల్, ఐటీ అధికారులు పరిశీలించి నిబంధనలు, ఆధారాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటారని అన్నారు. ఎన్నికల సమయంలో మనం సీజ్ చేసే నగదు, బంగారం, మద్యం, ఇతర విలువైన అభరణాల గురించి మీడియాకు సమాచారం అందించాలని, అదే విధంగా సంబంధిత వ్యక్తులు చేసిన అప్పీల్ అనంతరం విడుదల చేసే నగదు వివరాలు సైతం ప్రెస్ కు అందించాలని, దీనికి సంబంధించి ఎప్పటికప్పుడు నివేదిక నిర్ణీత నమూనాలో సమర్పించాలని అన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వేలెన్సు బృందాలు, వీడియో సర్వేలెన్సు బృందాలతో పాటు తప్పనిసరిగా వీడియో కెమెరా సౌకర్యం ఉండాలని, ప్రతి తనిఖీ వీడియో కెమెరాలో రికార్డు చేయాలని అన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వల్ నరబుల్ పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. వల్ నరబుల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించే సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు అందించే ఫిర్యాదులను సైతం దృష్టిలో ఉంచుకోవా లని పేర్కొన్నారు. జిల్లాలో ఓటర్ స్లిప్పులు త్వరగా ముద్రించి పంపిణీ చేసే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని , సామాజిక మాధ్యమాలలో ఎన్నికల నిర్వహణపై వస్తున్న వదంతులు, అపోహలను నివృత్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, తక్కువ పోలింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలపై అధిక దృష్టి సారించి పోలింగ్ శాతం పెరిగే విధంగా విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించా లని అన్నారు. జిల్లా వీడియో కాన్ఫరెన్స్ కాన్ఫరెన్స్ లో హాల్ నుంచి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ట్రైయినీ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, డీఆర్ఓ గణేష్, పీడీ డీఆర్ఏ శ్రీనివాస్ కుమార్, డీసీఓ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ జయరాజును అభినందించిన సీపీ అంబర్ కిషోర్ ఝా



**వరంగల్ వాయిస్, మడికొండ :** కాజీపేట పట్టణం ఎన్ఐటీ వద్ద గల తారా గార్డెన్ లో శనివారం పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా మడికొండ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ జయరాజు తన ఓ నెగటివ్ రక్తాన్ని 33వ సారి దానం చేసి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకొని ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్త దానం చేయడం వల్ల మరొకరికి ప్రాణ సహాయం చేసిన వారవుతారని తెలిపారు.

## యువత చూపు కాంగ్రెస్ వైపు



**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జనగామ పట్టణంలోని వివిధ వార్డుల నుంచి యువకులు జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి నాయకత్వంలో 150మంది యువకులు, కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కొమ్మూరి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వస్తుందని, అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు. యువ వికాసం పేరుతో విద్యార్థులకు రూ.5లక్షలు విద్య భరోసా కార్డులు అందివ్వడం జరుగుతుందన్నారు. తెలంగాణలో అన్ని మండలాలలో విద్యార్థుల కోసం ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తామని మాయ మాటలతో యువకులను మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే యువకులకు ఉద్యోగాలు వస్తాయని తెలిపారు.

## బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని ఖాదర్ పేట గ్రామానికి చెందిన పలు కాంగ్రెస్ కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలో చేరాయి. ఇదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కూస శ్రీను, కూస రాజు, పెంతల రాజి రెడ్డి, పెంతల రంజిత్, సింగిరెడ్డి సురేష్, సింగిరెడ్డి రాజు, కొనుకటి అఖిల్, కొనుకటి నితిన్, లక్కార్సు రాజేష్, పెంతల ప్రవీణ్, శీరంశెట్టి వెంకటేష్, అనుముల మహేందర్, ముస్కు వినయ్, కూస మధు, చెవ్వ మల్లయ్య, గంటి రాజేందర్, మస్కు నవీన్, దిడ్డి రవికుమార్ లు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి నర్సంపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు బాల్నె వెంకన్న, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, చెన్నారావుపేట సర్పంచ్ కుండె మల్లయ్య, ఖాదర్ పేట గ్రామ సర్పంచ్ అనుముల కుమారస్వామి, ఎంపీటీసీ దారవత్ శ్రీను, గ్రామ పార్టీ అధ్యక్షుడు చింతం మహేందర్, యూత్ అధ్యక్షుడు పెండ్లి రాజేశేఖర్, నాయకులు అరిగెల మల్లయ్య, పెంతల బుచ్చి రెడ్డి, అరిగెల రాజు, తోటకూర రాజేష్, కొనుకటి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని పుల్లయ్య బోడు తండ గ్రామం నుంచి బీఆర్ఎస్ పార్టీకి పలువురు రాజీనామా చేసి కాంగ్రెస్ గూటికి చేరారు. శనివారం వార్డు సభ్యులు అజ్మీరా గాగమ్మ భద్రు నాయక్ తో పాటు 15కుటుంబాలు గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు భూక్య ఈర్యా, క్లస్టర్ బాధ్యులు మాజీ ఎంపీటీసీ బిళ్ల ఇంద్రసేనా రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మంచాల సదయ్యల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. ఆయన కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యకయ్య గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సర్పంచ్ సిద్దన రమేశ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బండి హరీష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు రూపిక శ్రవణ్ కుమార్, బొజేర్వు గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు రాధారపు భిక్షపతి, ఉప సర్పంచ్ కుసుమ సతీష్, నాయకులు నూకల సాంబరాజు, సారయ్య, లక్క విజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఆశీర్వాద సభాస్థలి పరిశీలన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 27న గ్రేటర్ వరంగల్ 44వ డివిజన్ భట్టుపల్లి ఎస్సార్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభా స్థలాన్ని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధదన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా సభా స్థలిలో స్టేజ్ ఏర్పాటు, హెలిప్యాడ్, పార్కింగ్, సీటింగ్ వంటి ఏర్పాట్లపై నాయకులతో చర్చించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరువనున్న ఈ ప్రజా ఆశీర్వాద సభలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు. అలాగే నియోజకవర్గ ప్రజలు సీఎం కేసీఆర్ ఆశీస్సులతో వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మూడోసారి మీ ఇంటి బిడ్డగా వస్తున్న నేపథ్యంలో స్వచ్ఛందంగా తరలి వచ్చి సభను విజయవంతం చేసి నన్ను నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దసరా పండుగ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ పోతన పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. 28వ డివిజన్ లో పనిచేస్తున్నటువంటి పారిశుధ్య కార్మికులకు లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ పోతన అధ్యక్షుడు లయన్ పోరండ్ల రత్నాకర్ రావు చీరలు, మగవారికి నూతన వస్త్రాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ పూర్వ ప్రెసిడెంట్ గందే నవీన్ హాజరయ్యారు. కరోనా సమయంలో మనకు పారిశుధ్య కార్మికులు చేసిన సేవలు మనం ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. పరిసరాలు బాగుంటేనే ప్రజలు బాగుంటారని, దాని కోసం పారిశుధ్య కార్మికుల దైనందిన పరిశ్రమ సమాజానికి ఎంతైనా అవసరమన్నారు. అలాంటివారిని సత్కరించుకోవడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో లయన్స్ క్లబ్ వారు చేస్తున్నారని, ఇకముందు కూడా చేస్తారని లయన్ గందే నవీన్ తెలియజేశారు.

# ఫోన్ ఇస్తా.. మరీ నాకేంటీ..?



బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌతేలా ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. అందుకు కారణం వాల్తేరు వీరయ్య, ఏజెంట్ చిత్రాలలో హాట్‌హాట్ ఐటెమ్ సాంగ్స్‌లో కనిపించడం ఓ కారణమైతే... ఇనస్టాగ్రామ్‌లో ఈ బ్యూటీ అందాలను ఆరబోస్తూ పోస్ట్ చేసే ఫొటోలు మరో కారణం. ఈ మధ్యన జరిగిన భారత - పాక్ వన్డే వరల్డ్ కప్ మ్యాచ్‌లో తన ఖరీదైన ఫోన్ పోగొట్టుకుంది. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా వేదికగా తెలిపారు. వెంటనే సమీప పోలీస్ స్టేషనలో ఫిర్యాదు చేశారు. కానీ ఫోన్ మాత్రం తిరిగి రాలేదు. దాంతో ఫోన్ తిరిగి ఇచ్చినవారికి రివార్డ్ ఇస్తానని ఇనస్టాగ్రామ్ స్టోరీస్‌లో పోస్ట్ చేసింది. ఫోన్ పోయిన లోకేషన్‌ను కూడా షేర్ చేసింది. సోషల్ మీడియాలో ఆమె పెట్టిన పోస్ట్‌కు ఫలితం కనిపించింది. ఓ అజ్ఞాతవ్యక్తి నుంచి ఆమెకు మెసేజ్ వచ్చింది. 'మీ ఫోన్ నా దగ్గరే ఉంది. అది మీకు దక్కాలంటే క్యాన్సర్‌తో బాధపడుతున్న నా సోదరుడిని కాపాడుకోవడం కోసం సాయం చేయండి' అని సదరు వ్యక్తి కండీషన్ పెట్టాడు. అందుకు ఊర్వశి రౌతేలా సరే అన్నట్లు థంబ్స్ పోస్ట్ చేసింది. ఈ విషయాన్ని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. అయితే ఒప్పందం ప్రకారం అతను ఫోన్ తెచ్చాడా లేదా అన్నది తెలియాల్సి ఉంది.

## కొన్నిసార్లు అంతే... అనుకున్నవి జరగవు

శ్రీరామ్ నిమ్మల, కలపాల మౌనిక జంటగా నటిస్తున్న చిత్రం 'అనుకున్నవన్ని జరగవు కొన్ని'. శ్రీ భారత ఆర్ట్స్ సంస్థ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి జి.సందీప్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం పోస్టర్‌ను అల్లరి నరేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అనుకున్నవన్ని జరగవు కొన్ని' టైటిల్ లాంచ్ చేయడం ఆనందంగా ఉంది. పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. దర్శకుడు నేను నటించిన 'సిల్లీ ఫెలోస్' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాడు. ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం కావడం ఆనందంగా ఉంది. ఈ సినిమా విజయవంతమై టీమ్ అందరికీ మంచి పేరు రావాలి. దర్శకుడిగా సందీప్ బిజీ కావాలి" అని అన్నారు. దర్శకుడు సందీప్ మాట్లాడుతూ "దర్శకుడిగా తొలి చిత్రమిది. క్రైమ్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కించాం. కామెడీని బాగా ఎంజాయ్ చేస్తారు. నవంబర్ 3న విడుదల కానున్న మా చిత్రాన్ని తప్పకుండా థియేటర్స్‌లో చూడండి" అని అన్నారు.




## నందమూరి బాలకృష్ణకు అభినందనల వెల్లువ

నందమూరి బాలకృష్ణ, శ్రీలీల, కాజల్ అగర్వాల్ ముఖ్య తారాగణంగా విడుదలైన 'భగవంత్ కేసరి'కి మంచి పాజిటివ్ టాక్ వస్తోంది. అటు ప్రేక్షకుల నుంచి, ఇటు క్రిటిక్స్, ఇక బాలకృష్ణ అభిమానులు అయితే సరేసరి, ఈ సినిమాకి మంచి ప్రసంశలు వస్తున్నాయి, బాలకృష్ణ మరోసారి బ్లాక్ బస్టర్ ఇచ్చారు ఈ 'భగవంత్ కేసరి' తో అని అంటున్నారు. బాలకృష్ణ ఈ సినిమాలో తన ఇంతకు ముందు సినిమాలలో కాకుండా ఒక సాత్వికమైన నటనతో ఆకట్టుకున్నారని అంటున్నారు. అలాగే దర్శకుడు అనిల్ రావిపూడి (ఀనితిశ్రీఖీజీలతిజూబీటతి) కథ పాతదే అయినా అతను కొత్తగా చెప్పే విధానం, కథనం అందరినీ ఆకట్టుకుంటోంది అని అంటున్నారు. ఈ సినిమాకి అతని రచన అదే డైలాగులు, ఎమోషన్స్ కి ప్రేక్షకులు ముగ్దులవుతున్నారు. మొదటిసారిగా బాలకృష్ణ తెలంగాణ యాసలో చెప్పే డైలాగులు, సహజంగా ఉన్నాయని, అలాగే పోరాట సన్నివేశాలు కూడా బాగున్నాయని అంటున్నారు. ఇక ఈ సినిమా దసరా పండగ సందర్భంగా ఈరోజు విడుదలవ్వటం, అందరూ బాగుంది అనటంతో ఇక బాలకృష్ణకి అభినసందాల వెల్లువ మొదలైంది. ఈ చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి, ఇందులో నటించిన శ్రీలీలే, ఛాయాగ్రహణం అందించిన రాంప్రసాద్, అలాగే నిర్మాతలు బాలకృష్ణ ఇంటికి వెళ్లి అతన్ని అభినందించారు. ఈ సినిమాలో శ్రీలీల నటన అద్భుతంగా వుందని, ఆమె ఎమోషన్స్ తో పాటు పోరాట సన్నివేశాలు కూడా బాగా చేసిందని అభివర్ణిస్తున్నారు.




## అదరగొట్టిన టైగర్ నాగేశ్వరరావు

మాస్ మహారాజా రవితేజ నటించిన తొలి పాన్ ఇండియా చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. స్టూవర్టుపురంలో పేరుమోసిన గజదొంగ 'టైగర్ నాగేశ్వరరావు' జీవితం ఆధారంగా రూపొందిన ఈ చిత్రానికి వంశీకృష్ణ దర్శకత్వం వహించారు. అభిషేక్ అగర్వాల్ నిర్మించారు. నూపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ కథానాయికలు. 'వాల్తేరు వీరయ్య', "ధమాకా' చిత్రాలు మినహాయిస్తే మిగిలిన చిత్రాలు అంతంత మాత్రంగానే ఆడాయి. కానీ 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రం ఫస్ట్ లుక్ విడుదల మొదలు ట్రైలర్ వరకూ సినిమాకు హైప్ తీసుకొచ్చాయి. దీనికి తోడు పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయడంతో నార్త్‌లో కూడా ప్రచారం బాగా చేశారు. భారీ అంచనాల మధ్య ఈ చిత్రం శు క్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. మరి ఈ చిత్రం ఎలా ఉందో.. సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు ఏం మాట్లాడుకుంటున్నారో చూద్దాం... సినిమా ఫస్టాఫ్ అయ్యేసరికి స్పందన బాగానే ఉంది. ట్విట్టర్ వేదికగా నెటిజన్లు పాజిటవ్‌గానే మాట్లాడుకుంటున్నారు. డార్క్ క్యారెక్టర్‌లో రవితేజ యాక్షన్ అద్భుతంగా ఉందని, అలాగే యాక్షన సీన్స సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతున్నాయని చెబుతున్నారు. ట్రైన్ సీక్వెన్స్ ఆసక్తికరంగా ఉందని ట్వీట్స్ చేస్తున్నారు. మరో నెటిజన అయితే అంతా బాగానే ఉంది కానీ రన్ టైమ్ ఇబ్బందికరంగా మారిందని పోస్ట్ చేశారు. లవ్‌ట్రాక్ అంతగా వర్కవుట్ కాకపోవడం సినిమాకు మైనస్ అని, ఓ మోస్తరు సినిమా సోసోగా సాగిందని ఓ నెటిజన పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలో రవితేజ్ బెస్ట్ పెర్‌ఫార్మెన ఇదేనని చెబుతున్నారు.



## లియో తొలిరోజు రికార్డు ఎంతో తెలుసా..?

పలు వివాదాలు, అడ్డంకుల మధ్య విజయ్ హీరోగా తెరకెక్కిన 'లియో' చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్‌తో నడుస్తోంది. అయితే వసూళ్ల పరంగా ట్రెండ్ క్రియేట్ చేస్తోంది. అడ్వాన్స్ బుకింగ్స్‌లోనే అత్యధిక వసూళ్లు చేసిన ఈ చిత్రం మొదటిరోజు మంచి బిజినెస్ చేసింది. ట్రేడ్ పండితుల లెక్కల ప్రకారం వరల్డ్‌వైడ్‌గా తొలిరోజు రూ.140కోట్లకు పైగా రాబట్టిందని చెబుతున్నారు. దీంతో ఈ ఏడాది అత్యధిక వసూళ్లు రాబట్టిన కోలీవుడ్ చిత్రంగా రికార్డ్ సృష్టించింది. నార్త్ అమెరికాలో అక్టోబర్ 19న విడుదలైన అన్ని సినిమాల్లో 'లియో' టాప్‌లో నిలిచింది. కోలీవుడ్ సినిమా ఇలా ఓవర్సీస్‌లో టాప్ వన్‌లో కొనసాగడం చాలా అరుదు అంటూ ఎక్స్(ట్విట్టర్)లో పోస్టులు పెడుతున్నారు. దీంతో విజయ్ ఫాన్స్ ఖుషీ అవుతున్నారు. అభిమాన హీరో సాధించిన విజయాన్ని సెలబ్రేట్ చేసుకుంటున్నారు. లోకేష్ కనగరాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రారంభం నుంచి ఎన్నో వివాదాల మధ్య నలిగింది. విడుదలకు ముందుకు కూడా ఈ చిత్రానికి పలు సమస్యలు ఎదురయ్యాయి. ట్రైలర్ విడుదల తర్వాత అందులో అభ్యంతరకర డైలాగ్‌లు ఉన్నాయంటూ గొడవ చెలరేగింది తమిళనాడు ప్రభుత్వం బెనెఫిట్ షోలకు అనుమతి వ్వలేదు. వీటన్నింటి మధ్య కూడా సినిమా సక్సెస్ అయ్యి రికార్డులు సృష్టించడంతో చిత్రబృందమంతా ఆనందం వ్యక్తం చేస్తోంది. ఇందులో విజయ్ సరసన త్రిష కథానాయికగా నటించింది.



# పోలీసు అమరుల ఆశయాలను కొనసాగిద్దాం

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ**

**ఘనంగా నివాళులర్పించిన ప్రముఖులు**

**వరంగల్ వాయిస్, క్రైం :** పోలీసు అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూనే వారి స్ఫూర్తిగా విధుల్లో రాణిస్తూ ప్రజలకు సేవలందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ కోరారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో శనివారం అమరవీరుల స్థూపం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది నుంచి ఇప్పటి వరకు దేశంలో విధినిర్వహణలో మరణించిన 189 మంది పోలీస్ అమరవీరుల పేర్లను క్రైమ్స్ డీసీపీ దాసరి మురళీధర్ చదివి వినిపించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీతో పాటు వరంగల్ జిల్లా న్యాయమూర్తి రాధాదేవి, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తా పట్నాయక్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్, డీసీపీలు మురళీధర్, రవీందర్ తో పాటు అదనపు ఏసీపీలు, ఏసీపీలు, ఇన్ స్పెక్టర్లు, ఆర్ఐలు, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారుల సంఘం సభ్యులు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొని పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం ఆర్ఐ చంద్రశేఖర్ సారథ్యంలో సాయుధ పోలీసులు 'శోక్- క్రైస్త్' చేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజల సేవకోసం తమ ప్రాణాలను ఆర్పించిన పోలీసులు మహనుభావులని, వారు చూపిన మార్గదర్శనంలో ప్రజల శ్రేయస్సు కోరకు పాటుపడాలన్నారు. ప్రజల్లో మంచి పేరు రావాలంటే చిత్తశుద్ధి, నీతి, నిజాయితీతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేమని, వారు ఎల్లప్పుడు మన గుండెల్లోనే వుంటారని, వారు మన మధ్య లేకున్నా మనం వారిని స్మరిస్తూనే ఉంటామని, అసువులు బాసిన అమరవీరుల కుటుంబాలను కాపాడుకోవల్సిన భాధ్యత మనందరిపై ఉందని, వారికి ఎలాంటి సమస్య ఉన్నా వారికి పోలీస్ విభాగం తరుపున పూర్తి సహకారం అందజేస్తామన్నారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ కార్యాలయము నుంచి మిషన్ హస్పటల్ వరకు నిర్వహించిన ర్యాలీలో పోలీసు అధికారులు, సిబ్బంది అమరవీరుల కుటుంబ సభ్యులతో పాటు పోలీసు జాగృతి కళాబృందం సభ్యులు పాల్లొన్నారు.










## రక్తదానం..

పోలీస్ అమరవీరుల సంస్థల దినోత్సవం పురస్కరించుకొని కాజీపేట డివిజనల్ పోలీసులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సీపీ అంబర్ కిషోర్ ఝూ ప్రారంభించారు. కాజీపేట లోని తారా గార్డెన్స్ లో రెడ్ క్రాస్ హనుమకొండ విభాగం వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి కాజీపేట, మడికొండ, ధర్మసాగర్, హసన్ పర్తి, కమలాపూర్, వేలేరు, ఎల్కతుర్తి, వంగర, భీమదేవరపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని యువతీ యువకులు, పోలీస్ అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు.



# దుర్గా మాతగా భద్రకాళి

**వరంగల్ వాయిస్, కల్చరల్ :** శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీశరన్నవరాత్ర మహోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం ఏడో రోజు అమ్మవారిని దుర్గా మాతగా అలంకరించారు. అనంతరం నిర్వహించిన అమ్మవారి రథసేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ రోజు కార్యక్రమాలకు ఉభయదాతలుగా కరీంనగర్ వాస్తవ్యులు యాదా సత్యదీప్-ప్రవల్లి దంపతులు, కటకం సత్యనారాయణ - రంగమణి దంపతులు, కటకం సాయినీలేష్, రామా రాకేష్ - రమ్య దంపతులు, ఆకవరం వెంకట్ రెడ్డి-సృజన దంపతులు, సాయిమణికంఠ రెడ్డి, సోమనరసింహా రెడ్డి, పున్రెడ్డి క్రిష్ణారెడ్డి - రజని దంపతులు, బుచ్చమ్మ పాల్గొన్నారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి ఉభయదాతలకు శేషవస్త్రాలు బహుకరించి ప్రసాదాలు అందజేశారు. సాయంకాలం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కాచిరాజు నాగమణి భాగవతారిణిచే భక్త మార్కండేయ హరికథ, బి.శంకరాదిత్య, తోరణాల పద్మజ, పెండెం సౌమ్యలచే శాస్త్రీయ సంగీతం, వాణీ సతీష్ చే హిందుస్తానీ గాత్రం, గుమ్మడి జనార్ధన్ చే హిందుస్తానీ సితార్ వాద్యం, గంధం అజయ్ కుమార్ చే హిందుస్తానీ గాత్రం, నాగనారాయణ, శ్రీ సురేష్ చే హిందుస్తానీ వేణువాద్యం, కె.రంగవల్లి శిష్యబృందంచే కుడిపూడి నృత్యప్రదర్శన, కుండె అరుణరాజ్ కుమార్ శిష్యబృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన, ముత్యాల పరమేశ్వర్ శిష్యబృందంచే కూచిపూడి నృత్యం, పిన్నా జ్వాలాముఖి శిష్యబృందంచే కూచిపూడి నృత్యం, డాక్టర్ నవ్య నాగబండి శిష్యబృందంచే కూడిపూడి నృత్యం, సీతాలు రఘువేందర్ పార్టీచే భక్తి సంగీతం నిర్వహించారు. అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో భద్రకాళీ సేవాసమితి ఆధ్వర్యంలో ప్రతి రోజు అన్నదానం నిర్వహిస్తున్నారు.

# తనిఖీల్లో మార్గదర్శకాలను పాటించాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించే తనిఖీల్లో పట్టుబడే నగదు, బంగారం సీజ్ చేసేప్పుడు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఆయన రాష్ట్ర డీజీపీ అంజని కుమార్, ఇతర రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు, నగదు, బంగారం పట్టివేత, సి-విజల్ యాప్, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్ జిల్లా నుంచి కలెక్టర్ పి.ప్రావీణ్య, ఆర్వోలు షేక్ రిజవాన్ బాషా, వాఖడే, కృష్ణ వేణి, డీసీపీ రవీందర్, సంబంధిత ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పెండింగులో ఉండకుండా వేగవంతంగా పరిష్కరించాలని, రాజకీయ పార్టీల, అభ్యర్థుల నుంచి వచ్చే ఫిర్యాదులకు తప్పనిసరిగా తీసుకున్న చర్యలపై లిఖిత పూర్వక



సమాధానం అందించాలని సూచించారు. ఎన్నికల సమయంలో నిర్వహించే తనిఖీల్లో నగదు, బంగారం సీజ్ చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై క్షేత్రస్థాయి అధికారులకు సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో సంబంధిత వ్యక్తులకు సీజ్ చేస్తున్న నగదు, బంగారం వివరాలు, ఎక్కడ అప్పీల్ చేయాల్సి ఉంటుంది అనే అంశాలను తెలియజేస్తూ రశీదు తప్పనిసరిగా అందించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వేలెన్సు బృందాలు, వీడియో సర్వేలెన్సు బృందాలతో పాటు తప్పనిసరిగా వీడియో కెమెరా సౌకర్యం ఉండాలని, ప్రతి తనీఖీ వీడియో కెమేరాలో రికార్డు చేయాలన్నారు.



## 100 కంపెనీల బలగాల రాక

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల బందోబస్తుకు 300 కంపెనీల బలగాలను కేటాయించగా.. శనివారం 100 కంపెనీల బలగాలు తొలివిడతగా రాష్ట్రానికి రానున్నాయి. ఒక్కో కంపెనీలో అసోం రైఫిల్స్, బీఎస్ ఎఫ్, సీఐఎస్ ఎఫ్, సీఆర్ పీఎఫ్, ఐటీబీపీ, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ ఉంటారు. వీరంతా కీలక ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నియంత్రణ చర్యలు చేపడతారు.

– వరంగల్ వాయిస్, వరంగల్

# బీఆర్ఎస్‌లోకి ఒంటెల ప్రసాద్



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని 32 వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు, సోషల్ మీడియా ఇంచార్జ్ ఒంటెల ప్రసాద్ శనివారం తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు బీఆర్ఎస్ పార్టీలో చేరిన ప్రసాద్ ను కడుపులో పెట్టుకొని చూసుకునే బాధ్యత తనదన్నారు. పార్టీలో చేరిన ప్రసాద్ మాట్లాడుతు వరంగల్ తూర్పులో ఎమ్మెల్యే నరేందర్ చేసిన అభివృద్ధి, తూర్పులో మరొకసారి నరేందర్ విజయకేతనం ఎగురవేస్తున్న సందర్భంగా పార్టీలో చేరడం జరుగిందన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com